నేడు మల్లన్న ఎనిమిదో ఆదివారం

చేర్యాల, మార్చి 8 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో నేడు ఎనిమిదో ఆదివారం కావడంతో రాష్ట్ర నలుమూల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ తదితర పూర్వ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తులు మల్లన్నకు బోనం సమర్పించి పట్నం వేస్తారు. మల్లన్న గుట్ట పైన ఎల్లమ్మకు బోనం సమర్పిస్తారు. కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు తరలివెళ్లి అక్కడ బోనాలు సమర్పిస్తారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు కల్పిస్తున్నామని మల్లన్న ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

దండోరా ర్యాలీ

మిరుదొడ్డిలో వంద డప్పులతో ర్యాలీ నిర్వహిస్తున్న దండోరా నాయకులు

మిరుదొడ్డి, మార్చి 8: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి అమలు చేయాలని మాదిగ దండోరా నాయకులు కోరారు. శనివారం మిరుదొడ్డిలో బాబూజగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి వంద డప్పులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దండోరా నాయకులు కుమార్, రాజన్రు, నరేశ్, కరుణాకర్, మల్లేశం, స్వామి, పోచయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఎడ్యుఫెయిర్‌తో విద్యార్థులకు మేలు

ఎడ్యుఫెయిర్‌ను ప్రారంభిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల, మార్చి 8: పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో శనివారం నిర్వాహకులు చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై నిరేష్‌తో కలిసి రిబ్బన్ కట్‌చేసి ఎడ్యుఫెయిర్‌ను ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ ప్రయోగాత్మక విద్య విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రతి విద్యాసంస్థలో విద్యార్థులకు సైన్స్‌పై మరింత అవగాహన కల్పించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎగ్జిబిట్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఎడ్యుఫెయిర్‌కు హాజరైన అధికారులు, సిబ్బంది, తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం బాలకిషన్, ప్రిన్సిపాల్ శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయం

మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, మార్చి 8: సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద శనివారం సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ రాళ్లబండి వెంకటేశం పదోవర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్లబండి వెంకటేశం ఆశయసాధన కోసం యువత ఉద్యమించాలన్నారు. గ్రామాల్లో సీఐటీయూ సంఘాన్ని ఏర్పాటు చేసి యాజమాన్యంతో కొట్లాడి కార్మికుల రేట్లు పెంచిన ఘనత వెంకటేశానికి దక్కుతుందన్నారు. ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న సీపీఎం పార్టీకి అన్నివర్గాలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌మావో, పట్టణ కార్యదర్శి నాగరాజు, శాఖ కార్యదర్శి భాస్కర్, చందు, మండల కార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు శ్రీహరి, శోభ, మల్లేశం, ప్రభాకర్, శ్రీధర్, ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు స్పందన

సిద్దిపేట టౌన్: కుటుంబాన్ని ఏకం చేస్తున్న న్యాయమూర్తి సాయిరమాదేవి

హుస్నాబాద్: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

హుస్నాబాద్, మార్చి 8: హుస్నాబాద్‌లోని మున్సిఫ్‌కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 241కేసులు పరిష్కారమయ్యాయి. జడ్జి కృష్ణతేజ్ లోక్ అదాలత్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రాజీమార్గమే రాజామార్గమని, కక్షదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కారం చేసుకోవాలన్నారు. ఇందుకు లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,. అనంతరం పలు కేసులను విచారించారు. ఇందులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 131కేసులు, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి పరిధిలో 110 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేర్యాలలో 274 కేసులు పరిష్కారం

చేర్యాల, మార్చి 8: లోక్ అదాలత్‌లో 274 కేసులను చేర్యాల కోర్టు ఇన్‌చార్జి జడ్జి కృష్ణతేజ్ పరిష్కరించారు.శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌తో 225డ్రంక్ అండ్ డ్రైవ్, 13 ఒప్పుకున్న కేసులు, 26 బ్యాంకు కేసులు, 2 సైబర్ క్రైమ్ కేసులు, 8 రాజీపడిన కేసులతో పాటు బ్యాంకు సంబంధించిన కేసులో రూ. 18లక్షలకు రూ. 6.20లక్షలు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించారు. దీంతో పాటు తాగి బైక్ నడిపిన 22 మందికి రూ. 1000, మరో 10 మందికి రూ.2వేలు, మరో వ్యక్తికి రూ. 2500, ఫోర్ వీలర్ నడిపిన వ్యక్తికి రూ. 10వేల చొప్పున జడ్జి జరిమానా విధించారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్, మార్చి 8: కక్షిదారుల మధ్య రాజీకుదరడంతో జాతీయలోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమ వుతాయని లీగల్ సర్వీస్ మండల కమిటీ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.ప్రియాంక తెలిపారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, బ్యాంకు కేసులకు సంబంధించి పరిష్కారంలభించిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొంది సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. చిన్నచిన్న సమస్యలతో కక్షలు పెంచుకోవద్దన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట టౌన్, మార్చి 8: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌కు స్పందన వచ్చిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులను అధికారులు రాజమార్గం ద్వారా పరిష్కరించి కక్షిదారులకు ఉపశమనం కల్పించారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్ 3557, సివిల్ 50, మోటారు ప్రమాద కేసులు 15 పరిష్కరించారు. మోటారు ప్రమాద కేసుల బాధితులకు రూ.కోటి 16 లక్షల 5వేల పరిహారం అందించారు. కుటుంబకలహాల కారణంగా దూరంగా ఉంటున్న కుటుంబాన్ని ఏకంచేశారు. న్యాయమూర్తి సాయిరమాదేవి మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులు, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ చక్కని వేదిక అన్నారు.

మల్లన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్

మల్లన్నను దర్శించుకున్న భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్

చేర్యాల, మార్చి 8: కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదనపు కలెక్టర్‌కు ఆలయ అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గజ్వేల్, మార్చి 8: గజ్వేల్‌లోని ప్రభుత్వం గురుకుల పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం జరగనున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి పాతికేళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు తరలిరానున్నారు. గజ్వేల్ పట్టణ సమీపంలోని సంగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల 1988లో ప్రారంభమైంది. అప్పటి నుంచి 25ఏండ్లు నిండిన పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకునేందుకు కళాశాల ప్రాంగణం నేడు వేదిక కానుంది.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 8: దుద్దెడ ముస్లిం, మైనార్టీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ అక్బర్‌పాషా, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ నబీ, ప్రధాన కార్యదర్శిగా నూరొద్దీన్, క్యాషియర్‌గా నవీద్, సలహాదారులుగా సల్మాన్, గూడ్‌సాబ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి రైతు మృతి

దుబ్బాక,మార్చి 8: చింతకాయల కోసేందుకు చెట్టు ఎక్కిన రైతు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శనివారం దుబ్బాక పోలీసులు తెలిపారు. దుబ్బాక పట్టణానికి చెందిన ఎంగారి రాజిరెడ్డి(52) వ్యవసాయంతో పాటు భవన నిర్మాణ పనులకు కూలీగా వెళ్తుంటాడు. ఈ నెల 3న తన వ్యవసాయ పొలంలో ఉన్న కాయలను కోసేందుకు చింతచెట్టుపైకి ఎక్కాడు. చింతకాయలు కోస్తున్న క్రమంలో కాలుజారి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో సిద్దిపేట సర్కారు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం పరిస్థితి విషమించి రాజిరెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు దుబ్బాక ఎస్సై గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న పట్నం భూపాల్

సిద్దిపేట టౌన్, మార్చి 8: పెండింగ్ బిల్లులను ప్రభుత్వ తక్షణమే విడుదల చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవోస్ భవన్‌లో ఎస్‌టీయూ యూనియన్ ప్రథమ కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్లులు ఆలస్యం కావడం కారణంగా ఉపాధ్యాయుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని.. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో లింగ శ్రీనివాస్, రాములు, భూపాల్, శ్రీనివాస్, భిక్షపతి, రాజేశం, సంఘం నేతలు పాల్గొన్నారు.

అధిక మోతాదులో యూరియా వాడొద్దు

హుస్నాబాద్, మార్చి 8: వరి పంటకు యూరియా ఎరువును అధిక మోతాదులో వాడటం వల్ల తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, సాధ్యమైనంత తక్కువగా యూరియా వాడుకోవాలని హుస్నాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ మహేశ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూరియా చవకగా దొరుకుతుందని వరి పంటకు వాడితే దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. యూరియా అధికంగా వాడటం వల్ల పురుగులు ఆశిస్తాయని, పంటకాలం పెరుగుతుందని, తాలు గింజలు అధికంగా తయారవుతాయన్నారు. ఇన్ని నష్టాలు ఉన్న యూరియాను ఎక్కువగా వాడకూడదని రైతులకు సూచించారు. ఎకరానికి రెండు బస్తాల యూరియా మూడు నుంచి నాలుగు దఫాలుగా పొటాష్‌తో కలిసి వాడితే సరిపోతుందని, సరైన దిగుబడి వస్తుందన్నారు.

మూల్యాంకనం పారితోషికం చెల్లించాలి

మాట్లాడుతున్న బాకీ చంద్రభాను

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 8: 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన టెన్త్ మూల్యాంకనం చేసినా ఉపాధ్యాయులకు ఇంతవరకు పారితోషకం చెల్లించక పోవడం శోచనీయమని డెమొక్రటిక్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకీ చంద్రభాను అన్నా రు. శనివారం కొండపాక మండలంలోని దుద్దెడలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం మూల్యాంకనం జరిగిన వెంటనే ఉపాధ్యాయులకు పారితోషకాన్ని నగదు రూపం లో లేదా బ్యాంకులో జమ చేసేవారన్నారు. గత సంవత్సరం టెన్త్ మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు సంవత్సరం అవుతున్నా పారితోషికం చెల్లించకపోవడం సరైన విధానం కాదన్నారు. గత సంవత్సరం మూల్యాంకనం పైసలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం నియమించబడిన 2008 సంవత్సరం ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేల్స్‌తో పాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన పీఆర్‌సీ, డీఏలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఉద్యమాన్ని చేపడుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి దేవర మల్లయ్య, ఆడిట్ కన్వీనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిలిచిపోయిన పెండ్లి

చేర్యాల, మార్చి 8: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఓ యువతికి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి చెందిన ఓ యువకుడితో పెండ్లి నిశ్చయమైంది. ఈ నెల 9న చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో యువతి పెండ్లి చేసేందుకు అమ్మాయి కుటుంబ సభ్యులు కొన్ని రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు.పెండ్లి పత్రికలు సైతం పంచడంతో పాటు షాపింగ్ తదితర పనులు పూర్తి చేశారు. పెండ్లి ఏర్పాట్లు పెండ్లి కొడుకుకు తెలిసే జరిగినప్పటికీ సదరు యువకుడు ఈ నెల 7న బచ్చన్నపేట మండలంలోని మరో గ్రామానికి చెందిన యువతితో వెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న చిట్యాల గ్రామానికి చెందిన యువతి బంధువులు, గ్రామస్తులతో కలిసి చేర్యాల పోలీసులను శనివారం ఆశ్రయించారు. పెండ్లి జరిగే ముందు రోజు పెండ్లి కొడుకు మరో అమ్మాయితో వెళ్లిపోవడంతో యువతి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

శ్రీహరి కోటను సందర్శించిన విద్యార్థులు

శ్రీహరికోట సందర్శనలో అధ్యాపకులు, విద్యార్థులు

సిద్దిపేట టౌన్, మార్చి 8: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక, రసాయన శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం, శ్రీహరి కోటను సందర్శించారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్రం విభాగ అధిపతి డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. క్షేత్ర పర్యటనలతో విద్యార్థులు భారతదేశ ప్రగతి ప్రత్యేక్షంగా తెలుసుకుంటారన్నారు. దేశ అంతరిక్ష పరిశోధన రంగానికి కీలకమైన శ్రీహరి కోటను సందర్శించినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత విద్యార్థులు, బోధన సిబ్బందిని అభినందించారు.

రోడ్డుకు ఇరువైపులా క్లీనింగ్

రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయిస్తూ పర్యవేక్షిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేట అర్బన్, మార్చి 8: సిద్దిపేట పట్టణ శివారులోని ఆక్సిజన్ పార్క్, సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయం, రాంపల్లి వెళ్లేరోడ్డుకు ఇరువైపులా చెట్లకొమ్మలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, పోలీస్ హౌసింగ్ బోర్డ్ ఏఈ రాజశేఖర్, త్రీటౌన్ సిబ్బంది జేసీబీ సహాయంతో శనివారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మలు, చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాంపల్లి రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, కానిస్టేబుళ్లు అశోక్, పరశురాములు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న శివచంద్రం

సిద్దిపేట టౌన్, మార్చి 8: హైకోర్టు ఆర్డర్‌ని ధిక్కరించిన సిద్దిపేట పురపాలక టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి గుండ్ల శివచంద్రం డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట శివారు వైజంక్షన్ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణంపై హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి దేవరాజ్ పెడచెవిన పెట్టారని ఆరోపించారు. మున్సిపల్‌లో అవినీతి పెరిగిందని కోర్టు ఆర్డర్ ధిక్కారనే కాకుండా సీసీఆర్ సంస్థ నుంచి పదుల సంఖ్యలో ఆర్‌టీఐ ద్వారా రికార్డు వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసినా అనుమతులు ఇవ్వలేదన్నారు. అసలు స.హ. చట్టం అమలులో ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు సాజిద్ పాషా, రాజు, రవితేజ, గణేశ్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 8: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఘటన ఉమ్మడి మద్దూరు మండలంలోని అర్జున్‌పట్లలో చోటు చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టగూడం గ్రామానికి చెందిన మాలోత్ సాయికుమార్ టీఎస్ 25టీ 2288 నెంబర్ గల వాహనంలో 4క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని మద్దూరు పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాహనంతో పాటు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

అంగన్‌వాడీకి విరాళం

చిన్నారులకు స్టీల్ బాటిల్స్ అందజేస్తున్న బాలచందర్ కుటుంబ సభ్యులు

చేర్యాల, మార్చి 8: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు టీజీఎస్పీడీసీఎల్ (హైదరాబాద్)లో విధులు నిర్వహించిన కీర్తిశేషులు కాటం బాలచందర్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు శనివారం కేంద్రానికి రూ.5వేల విలువైన పోల్డింగ్ టేబుల్, స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. బాలచందర్ ఇంట్లో గత 11ఏండ్లుగా అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండడంతో అదే కేంద్రంలో ఆయన కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి జయంతి నిర్వహించారు. చిన్నారులకు కేక్, స్వీట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బాల్‌లక్ష్మి, మౌనిక, సాయికుమార్, రోహిత్‌కుమార్, అంగన్‌వాడీ కేంద్రం టీచర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

డిపాజిటర్లు ఆందోళన చెందొద్దు

గజ్వేల్, మార్చి 8: సహారా సంస్థకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, డిపాజిటర్లు ఎలాంటి ఆందోళన చెందవద్దని గజ్వేల్ పరిధిలోని సహారా సంస్థ ఏజెంట్లు వెంకటాచారి, అశోక్, మల్లేశం, లక్ష్మణ్, జితేందర్ తెలిపారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలస్యమైనా ప్రతి డిపాజిటర్‌కు సంస్థ నుంచి డబ్బులు వస్తాయన్నారు. మల్లికార్జున్, ప్రసాద్, సతీశ్, స్వామిగౌడ్, విజయ్ కుమార్, శ్రీనివాస్, నర్సింహులు, స్వామి, ఉపేందర్, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.



గజ్వేల్: మహిళలను సన్మానిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



బెజ్జంకి: బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో...

చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్సై, మహిళ పీసీలను సన్మానిస్తున్న సీఐ శ్రీను

గజ్వేల్: మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



సిద్దిపేట మూడో వార్డులో మహిళలను సన్మానిస్తున్న కౌన్సిలర్ వంగ రేణుకాతిరుమల్‌రెడ్డి

ఆమెకు వందనం

జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మహిళలు కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. మహిళలు, మహిళా ఉద్యోగులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని గుర్తుచేశారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని పనులు చేస్తున్నారన్నారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, మార్చి 8

సిద్దిపేట: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట అర్బన్: మహిళా సిబ్బంది సన్మానిస్తున్న సీఐ విద్యాసాగర్

ధూళిమిట్ట: బైరాన్‌పల్లిలో మహిళా దినోత్సవ వేడుకలు

గజ్వేల్ : ఎమ్మెల్సీ కవితను కలిసిన గ్రీన్ ఇండియా చాలెంజ్ జిల్లా కో-ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు

కొండపాక(కుకునూరుపల్లి): కొండపాకలో మహిళా ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

మద్దూరు గ్రామ పంచాయతీ వద్ద కేక్‌కట్ చేస్తున్న మహిళలు

హుస్నాబాద్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా పారిశుధ్య కార్మికులకు సన్మానం

దుబ్బాక: సర్కిల్ కార్యాలయంలో మహిళా పోలీసులను సన్మానిస్తున్న సీఐ శ్రీనివాస్